విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 14, ఏప్రిల్ 2024

ఇండియా కూటమి అభ్యర్థి తోగూరు ఆర్థర్‌ను గెలిపించుకుందాం..!!

విశాలాంధ్ర-నందికొట్కూరు: నందికొట్కూరు నియోజకవర్గ సీపీఐ, సిపిఎం, కాంగ్రెస్ బలపరిచిన ఇండియా కూటమి అభ్యర్థితో తొగురు ఆర్థర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్య వర్గ సభ్యులు రఘురామమూర్తి, రమేష్ బాబులు కోరారు. శనివారం ఎమ్మెల్యే ఆర్థర్ కొత్తపల్లి మండలం సంగమేశ్వరంలో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆయనతో పాటు సీపీఐ నాయకులు పాల్గొని ఆయన గెలుపుకు ముమ్మర ప్రచారం చేశారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: వేసవికాలం ఎండ తీవ్రత, వడగాల్పులతో వడదెబ్బకు గురై జ్వరాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయవలసిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. అత్యవసర మెడిసిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విశ్వనాథ్, సూపర్వైజర్లు రామచంద్రుడు, దస్తగిరి, ప్రమీలమ్మ, లక్ష్మీదేవి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-నందికొట్కూరు : భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి భారతరత్న డా.బి.ఆర్ అంబేద్కర్ 133వ జయంతిని ఘనంగా నిర్వహించాలని వైసీపీ యువ నాయకులు ఎక్కలదేవి చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో అంబేద్కర్ జయంతిని ప్రతి గ్రామంలో కుల మతాలకతీతంగా ప్రతిఒక్కరూ ఘనంగా నిర్వహించాలన్నారు. అంబేద్కర్ యొక్క సేవలు భారతదేశంలో ఆయన రచించిన రాజ్యాంగం ద్వారా బడుగు బలహీన వర్గాలు, మహిళలకు రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు ఎలా హక్కులు వచ్చాయో ప్రజలకు వివరించి తెలియజేయలన్నారు.

చల్లా..కాటసాని కుటుంబాలు ఎప్పటికీ ఒకటే..!

విశాలాంధ్ర -అవుకు: బనగానపల్లి నియోజక వర్గంలోని బలమైన ఓటు బ్యాంకు కలిగిన చల్లా- కాటసాని కుటుంబాలు ఎప్పటికీ ఒకటేనని ఆయా కుటుంబ సభ్యులు తెలిపారు. నంద్యాల పార్లమెంటు వైసీపీ సమన్వయకర్త మాజీమంత్రి రామసుబ్బారెడ్డి, ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,చల్లా కుటుంబసభ్యుల సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాష్ రెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైసిపి ముఖ్య నాయకులు చల్లా విగ్నేశ్వర్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, అవుకు ఉపసర్పంచు చల్లా రఘునాథరెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి,నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు కలిసి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటసాని,చల్లా కుటుంబాలు ఎప్పటికీ ఒకటేనని ఏవైనా చిన్న చిన్న పొరపచ్చాలు ఉంటే వాటిని అన్నింటిని దూరంగా పెట్టి ఎమ్మెల్యేగా మరోమారు కాటసాని రామిరెడ్డి గెలుపుకు పూర్తిస్థాయిలో అంకిత భావంతో పనిచేస్తామని తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల గెలుపే ధ్యేయంగా ఎలాంటి మనస్పర్థలు లేకుండా ఒకే కుటుంబంలాలా పనిచేస్తామన్నారు. ఇక నుండి రాజకీయాల్లోనూ ఐకమత్యంగా ముందుకుసాగాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

ఎంపీ పోచా వైసీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో నంద్యాల పార్లమెంట్ వైయస్సార్సీపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.రాష్ట్రంలో గత 58 నెలలుగా జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మే 13న జరగనున్న ఎన్నికల్లో ఓట్లేసి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీగా తనకు రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ మైనార్టీసెల్ కార్యదర్శి ఇక్బాల్‌బాష, మండల అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బుడ్డా విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, నాయకులు బుడ్డా ఈశ్వరరెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, మూసాని శివానందరెడ్డి, లాలమ్మ గారి హుసేని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లిలో బీసీ విజయం తథ్యం

విశాలాంధ్ర-బనగానపల్లె: తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీసీ జనార్థన్‌రెడ్డి గెలుపు తథ్యమని మండల తెలుగుదేశం సీనియర్ నాయకులు చల్లా విజయ భాస్కర్ రెడ్డి, మోట్ల రామిరెడ్డిలు అన్నారు.మండలంలోని అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తూ పార్టీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు.ప్రతి ఇంటికెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరిస్తూ పార్టీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా చల్లా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువుతాయన్నారు. మే13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డిని, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకుని అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోట్ల ప్రతాప్ రెడ్డి, మోట్ల మనోహర్ రెడ్డి, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డలో మరోసారి వైసీపీ జెండా ఎగురవేద్దాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: రానున్న ఎన్నికల్లో ఆళ్లగడ్డలో వైసీపీ జెండాను మరోసారి ఎగురవేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గంగుల నానిని గెలిపించుకుందామని రాష్ట్ర జలవనరులశాఖ సలహాదారులు గంగుల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆళ్లగడ్డ పట్టణ స్థాయిబూత్ కమిటీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమం సాధ్యమన్నారు. మే13న జరగనున్న ఎన్నికల్లో టీడీపీని ఓటుతో ఇంటికి సాగనంపుదామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వ హాయంలో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరలేదని.. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన ఐదేళ్లలో సీఎం జగన్ అన్నివర్గాలకు న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలు అందించారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్ళీ జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల్లో భాగంగా ప్రతి ఇంటికి మేలు జరిగిందని బూతు స్థాయిలో కార్యకర్తలు ప్రతి ఇంటింటికి తీసుకువెళ్లి వారికి వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి తనను గెలిపించాలన్నారు.నాయకులు గంగుల సుదర్శన్ రెడ్డి, భూమా కిషోర్ రెడ్డి, నంద్యాల విజయ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి, నంద్యాల విజయ డైరీ డైరెక్టర్ గంగుల విజయసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో దొంగ మస్టర్లపై సర్పంచు ధ్వజం

విశాలాంధ్ర-వెలుగోడు: మండలం లోని అబ్దుల్లాపురంలో జరుగుతున్న ఉపాధిహామీపనుల్లో అవకతవకలు ఉన్నాయని సర్పంచు నాగలక్ష్మమ్మ జిల్లా కలెక్టరు, ప్రాజెక్టు డైరెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. జంబులమ్మ ఆలయం వద్ద ఉపాధిహామీ పనులు జరుగుతుండగా, పనిచేసే కూలీలు మాకు కూలీ సరిగాపడటం లేదని, మాకు అన్యాయం జరుగుతుందని ఫిర్యాదు చేశారు.దీంతో పనుల వద్దకు వెళ్లి పరిశీలించానన్నారు. మస్టర్లలో కూలీల సంతకాలు లేవని, హాజరు వేయలేదని చెప్పారు. శనివారం చివరిరోజు అయినా మస్టర్లలో హాజరు లేదు. పనికిరాని గ్రామస్తుల పేర్లు చాలా ఉన్నాయని, ఇలా చాలా రోజుల నుంచి జరుగుతుందని సర్పంచు ఆరోపించారు.సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్ కమతం సురేష్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోన్నాడని, వైసీపీ-టీడీపీ అంటూ రాజకీయం చేస్తున్నారని, మెటీల పద్ధతి లేదన్నారు. వైసీపీ కార్యకర్తల దగ్గర మస్టర్ల ఉన్నాయన్నారు.పని దగ్గర హాజరు వేయడం లేదని, పని వద్ద 10 శాతం కూలీ లు పనిచేస్తే , 20 శాతం కూర్చుని వెళుతున్నారని, వైసీపీ మద్దతు దారులు కే హాజరు వేస్తున్నారని, లేకుంటే లేదని ఫిర్యాదు చేశారు.ఈ విషయంపై ఏపీవో మల్లికార్జునను వివరణ కోరగా ఉపాధిహామీ పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణ ఉంటుందని, ఎలాంటి అవకతవకలు జరిగే ఆస్కారం లేదని అన్నారు.గ్రామంలో రాజకీయ వర్గాలు ఉన్నందున ,ఫీల్డ్ అసిస్టెంట్ ఒక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆరోపణలు వస్తున్నాయని, ఒకవేళ పనుల్లో అవినీతి జరిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని పోయి విచారణ చేస్తామని ఏపీవో అన్నారు.

అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణపతకం సాధించిన అర్షు అంజు

మాజీమంత్రి శిల్పా, ఎమ్మెల్యే శిల్పా అభినందనలు

విశాలాంధ్ర - నంద్యాల : అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం సాధించిన నంద్యాల దేవనగర్ చెందిన షేక్ అర్షు అంజుకు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డిలు అర్షుఅంజు సన్మానించి క్రీడా సామాగ్రిని కానుకగా అందించారు. స్థానిక దేవనగర్‌కు చెందిన దస్తగిరి,రజియాబీదంపతుల కుమార్తె అర్షుఅంజు అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ లో స్వర్ణ పథకం సాధించి తన సత్తాను చాటుకున్నది. ఈనెల 1 నుండి 5వరకు నేపాల్ లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ జూనియర్స్ 57 కేజీ విభాగంలో నిర్వహించిన పోటీలో బంగారు పతకాన్ని సాధించి అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకు వచ్చిందన్నారు. స్థానిక జిమ్ సెంటర్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్న అర్షుఅంజు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధిస్తూ తన యొక్క ఉత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి అంచలంచెలుగా రాణిస్తూ అంతర్జాతీయ స్థాయికి చేరుకొని స్వర్ణపథకం సాధించింది. క్రీడాభిమానులు, పట్టణ ప్రముఖులు షేక్ అర్షు అంజును ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నారు. భవిష్యత్తులో భారత దేశానికి మరిన్ని పథకాలు సాధించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

ఘనంగా శ్రీచౌడేశ్వరిమాత జ్యోతి మహోత్సవం

విశాలాంధ్ర-బనగానపల్లె: నంద్యాల జిల్లా బనగానపల్లె మండల పరిధిలోని నందవరంలో వెలసిన శ్రీకాశీవిశాలాక్ష్మి ప్రతిరూపమైన శ్రీ చౌడేశ్వరీమాత శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతి ఉత్సవం శనివారం ఉదయం జ్యోతులన్నీ అమ్మవారి సన్నిధికిచేరుకోవడంతో ముగిసింది. ఆలయ కార్యనిర్వాహణాధికారి కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో జ్యోతి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి విశ్వబ్రాహ్మణ భాస్కరయ్య ఆచారి అమ్మవారికి దృష్టి చుక్క పెట్టడం, అమ్మవారి ఆలయం ఎదురుగా మంటలు రాజేయడం ద్వారా జ్యోతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.అనంతరం ఈవో కామేశ్వరమ్మ ఆలయ కమిటీ వహీకర్త రాజేశ్వరరావు గ్రామంలోని జ్యోతి మండపం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి జ్యోతి ఉత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారికి మొక్కు చెల్లించేవారు గోధుమపిండి, నెయ్యి ద్రవ్యాలతో జ్యోతిని తయారుచేసి, సర్వాంగ సుందరంగా అలంకరించి జ్యోతులను తలపై వుంచుకుని మంగళవాద్య బృందంతో లయబద్ధంగా నృత్యం చేస్తూ భక్తిగీతాలు ఆలాపిస్తూ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఒంటిగంటకు మొదలైన జ్యోతిఉత్సవం ఉదయం 9గంటల వరకూ జ్యోతి ఉత్సవం కన్నులపండువగా కొనసాగింది. జ్యోతిమహోత్సవంలో కీలకఘట్టం తలపై జ్యోతి పెట్టుకుని భక్తులు అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో నిప్పులపై నడుచుకుంటూ వెళ్లి ఆపై జ్యోతితో అమ్మవారిని దర్శించుకోవటం జరిగింది.భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పూజలు, గర్భాలయ ప్రవేశాన్ని తాత్కాలికంగా రద్దు చేసి కేవలం అమ్మవారి దర్శనం మాత్రమే కల్పించారు. జ్యోతి ఉత్సవంలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకుండా బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నంది వర్గం, బనగానపల్లె, ప్యాపిలి, అవుకు ఎస్సైలు తిరుపాలు, రామిరెడ్డి, జగదీశ్వర రెడ్డి,కిరణ్‌బాబులు పెద్దసంఖ్యలో పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. నందవరం పీహెచ్‌సీ వైద్యులు వైద్యసేవలు అందించారు. పల్లె ఆర్టీసీ డిపో భక్తుల రాకపోకలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడిపారు. గ్రామ రైతు సంఘం సభ్యులు ఉత్సవాలకు వారి వంతు సహకారం అందించారు. ఈజ్యోతుల ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిచ్చారు.

కన్నుల పండువగా రథోత్సవం

శ్రీచౌడేశ్వరీమాత తిరుణాలలో భాగంగా ఐదవ రోజైన శనివారం సాయంత్రం 5 గంటలకు అమ్మవారి రథోత్సవం పోవడం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని రథంలో కొలువుదీర్చి భక్తులు భక్తిపారవశ్యంతో రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవం ఉరువాకిలి వద్దకు చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది.

పొత్తుల పార్టీలు..వైసీపీ ప్రభంజనంలో చిత్తు కావడం ఖాయం

విశాలాంధ్ర - నంద్యాల : ఎన్ని పార్టీలు పొత్తులతో కలసి వచ్చినా వైసీపీ ప్రభంజనంలో చిత్తు కావడం ఖాయమని ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి ప్రజలకు గుర్తుండిపోయేలా ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రవేశ పెట్టలేదని ఎద్దేవా చేశారు. నంద్యాలలో టీడీపీ అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ 17 ఏళ్ల అధికారం అనుభవించి నంద్యాల ప్రజలకు గుర్తుండి పోయే ఒక మంచి కూడా చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ఏకలవ్య నగర్, ఎన్జీవోస్ కాలనీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశం సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ మురళి, వార్డు ఇంచార్జ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్‌బాష, పోచ జనార్దన్‌రెడ్డిలు కలిసి ఎన్నికల ప్రచార నిర్వహించారు. వైసీపీ అందించిన సంక్షేమ అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ వైసీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికలారెడ్డి, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

జోరు మీదున్న బనగానపల్లె టీడీపీ- ఆగని వలసలు

విశాలాంధ్ర-బనగానపల్లె: గత కొద్ది రోజులుగా బనగానపల్లె, సంజామల,కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు మండలాల్లోని కీలక వైసీపీ నేతలతో పాటు, క్రియాశీలక కార్యకర్తలు బీసీ జనార్థన్‌రెడ్డికి మద్దతుగా వైసీపీని వీడి టీడీపీలో చేరడం గమనార్హం. చేరికల కార్యక్రమంలో కొలిమిగుండ్ల మండలం, బెలుం సింగవరం గ్రామానికి చెందిన బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, విశ్వనాథరెడ్డి, కైప వెంకటసుబ్బారెడ్డి, నడిపి దస్తగిరి, నసరుద్దీన్, రఘునాథ్‌రెడ్డి, గణేష్, తోటరామయ్య, బిజ్జం చిన్న వెంకటరామిరెడ్డి,నన్నేభాష, కైప వెంకటేష్‌రెడ్డి,బొడ్డుహుశేన్‌షా, నడిపి కంబగిరి రాముడు, పెద్ద కంబగిరి రాముడు, మద్దయ్య, మౌలాలి, మహమ్మద్‌వలి, పక్రుద్దీన్, చిన్న వలి, షేక్ మస్తాన్ వలి, మునగల శ్రీరాముడు, మద్దయ్య, చిన్న కంబయ్య, నడిపి కంబయ్య, చిన్న ఓబులేసు, మద్దయ్య, పెద్దఎద్దులోడు, మునగాల గిరి, భాస్కర్, దొమ్మిరి సురేంద్ర, బూరగల కంబగిరి రాముడు, మునగల కృష్ణయ్య (ఎమ్మార్పీఎస్) 50 కుటుంబాల వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ కుటుంబాలతో సహా బీసీ ఇందిరా రెడ్డి సమక్షంలో టీడీపీ పార్టీలో చేరారు.

శిల్పా కుటుంబం డబ్బుతో బంధాలు విడగొడతారు

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల రాజకీయాలు నేటినుంచి రంజుగా మారనున్నాయి. రాష్ట్రంలో బిజెపి,టీడీపీ, జనసేన పొత్తుతో నేతలు ప్రచారంలో దూసుకుపోతున్నారు. రాజకీయ సంచనాలు సృష్టించే నంద్యాలలో కొన్ని అనివార్య కారణాలతో బిజెపితో కలవలేకపోయింది. కూటమి మధ్య అసమానతలు తొలగిపోయాయి. అందరూ ఒక్కటయ్యారు. చెయి చెయి కలుపుకున్నారు. నంద్యాలలో టీడీపీ జెండా ఎగరడమే లక్ష్యంగా రాజకీయ కదనరంగంలో కొదమసింహాల్లా ఇంటింటికీ ప్రచారం చేస్తామని కలిసిపోయారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో జిల్లాఅధ్యక్షులు మల్లెల రాజశేఖర్ అధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి నంద్యాల పార్లమెంటు కో-ఆర్డినేటర్ మదు మాట్లాడుతూ శిల్పా ఓటమే కూటమి ధ్యేయమన్నారు. సార్వత్రిక ఎన్నికలు కీలకమని శిల్పా విజయం సాధిస్తే బ్రిటిష్, హిట్లర్, తుగ్లక్ పరిపాలన చూస్తామన్నారు. టెక్కె మార్కెట్ యార్డ్‌లో తక్కువధరకు రూములు బాడుగకు తీసుకొని 10 శాతం తక్కువ ధరకు ఇస్తూ సేవ చేస్తున్నామని చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పగలు రెండు కండువాలు, రాత్రి మూడు కండువాలు వేసుకుంటున్నారని వ్యంగ్యంగా మాట్లాడటం శిల్పాకు తగదన్నారు.టీడీపీ విజయం ఎంతో అవసర మన్నారు. నంద్యాల పార్లమెంటులోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు,జనసేన, టీడీపీ నాయకులు కలసి ప్రచారంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సుబ్బారెడ్డి, రమణ, మహారాజ్, బొరెడ్డి లక్ష్మిరెడ్డి,సుబ్బారెడ్డి, శివకృష్ణ యాదవ్, కసెట్టి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి, ఉపేంద్రరెడ్డి, లక్ష్మిరెడ్డిలు పాల్గొన్నారు.

నంద్యాల: ప్రజలకు మౌలికవసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే శిల్పారవి విఫలం చెందారని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఆరోపించారు. వార్డు పార్టీనాయకులు వేదసాయినాథ్, విజయగౌరీ యాదవ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఏవార్డుకెళ్లినా తాగునీరు,డ్రైనేజీ, రహదారులు, మౌ లిక వసతులు కల్పించడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో స్థానిక నాయకుడు టీడీపీ అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్‌ను ఎమ్మెల్యేగా, బైరెడ్డి శబరిని ఎంపీగా గెలిపించుకొని సమస్యలు పరిష్కరించుకునేలా చేసుకోవాలన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి- బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విశాలాంధ్ర-నందికొట్కూరు: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పాలన అందిస్తున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని సంగయ్యపేట ఏడోవార్డు శాంతి టాకీస్ నుంచి గడపగడప తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో విద్య, వైద్యం రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ముఖ్యంగా నవరత్నాల్లో భాగంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని సంక్షేమ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దిన ఏకైక సీఎం వైయస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు చేతకానితనంతో రాష్ట్రంలో బిజెపి, జనసేనతో పొత్తు పెట్టుకుని రాష్ట్రాన్ని నాశనం చేయడం కోసం కూటమిగా ఏర్పడ్డారన్నారు. వారికి సరైన బుద్ధి చెప్పేందుకు రాష్ట్ర ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. నందికొట్కూరు వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధీర్ ను, ఎంపీ అభ్యర్థి బ్రహ్మానంద రెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పురపాలక సంఘం చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్ నాయిబ్, వైసీపీ యువ నాయకులు చంద్రమౌళి, పట్టణ అధ్యక్షులు మన్సూర్, చిన్న మల్లారెడ్డి, ఉపేంద్ర రెడ్డి, చింత విజ్జి, అబూబకర్, ఉస్మాన్ బేగ్, పట్టణ యూత్ వింగ్ ప్రెసిడెంట్ లడ్డు, రామకృష్ణ, కౌన్సిలర్లు చినరాజు, లాలూ ప్రసాద్, చాంద్ బాషా, కృష్ణ, బొట్టు రవి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర-నందికొట్కూరు : స్థానిక బైరెడ్డి నగర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోట ఎన్నికల కేంద్రంలో ఏర్పాటు చేసిన 3 పోలింగ్ బూత్‌లను నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డి శనివారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ బూత్‌ల్లో వసతులు గూర్చి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సలీంభాషాను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం పోలింగ్ బూత్‌లవద్ద ర్యాంప్‌లు,విద్యుత్,నీటి వసతి, టాయిలెట్లు, ఫర్నిచర్‌ను నిశితంగా పరిశీలించి చేయాల్సిన మార్పులు వారికి సూచించారు. వారివెంట పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ, ఎన్నికల మాస్టర్ ట్రెయినీస్ వెంకట రమణ,మున్సిపల్ సీనియర్ సహాయకులు రమణయ్య, వెంకటేశ్వర్లు, బీ.యల్.ఓలు పుష్పరాజు, స్వామన్న,మున్సిపల్ శానిటరీ మేస్త్రి పరమేష్ ,రికార్డు సహాయకులు మురళీ కృష్ణ, ఎలక్ట్రీషియన్ చాంద్ భాష,నాగరాజు,మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీడ కరువు..బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

విశాలాంధ్ర-చాగలమర్రి: జాతీయ రహదారిపై బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.మండుటెండలో బస్సుల కోసం రహదారులపైనే నిరీక్షణ చేస్తున్నారు. మల్లేవేముల బస్టాండు, అడ్డవాగు, నగల్లపాడు, మద్దూరు, పెద్దబోదనం, రాంపల్లెమెట్ట వద్ద ఎలాంటి బస్సు షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు ఎండలో చెట్ల కింద, దుకాణాల్లో బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి. రూ.20 లక్షలతో నిర్మించిన బస్టాండు కూడా నిరుపయోగంగా మారింది.

నీటి సమస్య పరిష్కరించిన కమిషనర్

విశాలాంధ్ర- నందికొట్కూరు: వేసవికాలం కావడంతో నీటిఎద్దడిని దృష్టిలో పెటుకొని పట్టణ పురపాలక కమిషనర్ సుధాకర్‌రెడ్డి పట్టణంలో మద్దూరు సుబ్బారెడ్డి నగర్‌లో నూతన బోరుకు మోటర్ బిగించి పట్టణ ప్రజలదాహార్తిని తీర్చడం జరి గింది. ఈ నూతనబోరుతో పట్టణంలోని సాయిబాబా పేటలో ఉన్న ఓహెచ్ ఎస్సార్ ట్యాంకు కనెక్షన్ ఇవ్వడం జరిగింది. దీంతో హాజీ నగర్, సాయిబాబా పేట, హాస్పిటల్ రోడ్డు కాలనీలకు నీటి కొరత తగ్గుతుందని తెలిపారు. ఈయన వెంట మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, చుట్ట రామయ్య, దామోదర్‌రెడ్డి మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పల్లోలికి పూలేఅవార్డు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: మండల కేంద్రమైన కొలిమిగుండ్లకు చెందిన ప్రముఖ రచయిత, కవి, రేడియో ఆర్టిస్ట్, సీనియర్ జర్నలిస్ట్ పల్లోళి శేఖర్ బాబును మహాత్మ జ్యోతిరావు పూలే లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు వరించింది.వైయస్సార్ కడప జిల్లా పొద్దుటూరులోని మనం ఫౌండేషన్ చైర్మన్ అడ్వకేట్ కె చక్రవర్తి ఈ అవార్డుకు వి.శేఖర్‌బాబును ఎంపిక చేసినట్లు తెలిపారు. సమాజ సేవ దృక్పథంతోపాటు, బలహీన వర్గాల అభ్యున్నతి, చైతన్యం కోసం ఆయన చేస్తున్న రచనలు, కవితలు, సాంస్కృతిక పౌరాణిక సాంఘిక నాటకాలను దృష్టిలో పెట్టుకుని పూలే అవార్డును ప్రకటించారు.కొలిమిగుండ్లలో కళా స్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థను నెలకొల్పి అభ్యుదయ సమాజం కోసం కవిత పోటీలు, పౌరాణిక నాటక ప్రదర్శనలతో కళాకారులను ప్రోత్సహిస్తూ భారతీయ కళల సంరక్షణకు చేస్తున్న విశేష కృషిని పరికరంలోకి తీసుకొని శేఖర్ బాబుకు అవార్డును ప్రకటించారు. మహాత్మ జ్యోతిరావు పూలే లైఫ్ టైం అవార్డుకు తనను ఎంపిక చేయడంపై పలులు శేఖర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. తనపై మరింత బాధ్యత పెరిగిందని అభ్యుదయ సమాజం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బీసీలు రాజ్యాదికారం దిశగా పయనించాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : బి.పి.మండల్ వర్ధంతి సందర్భంగ ఆత్మకూరులోని బి.సి.సంఘ కార్యాలయంలో శనివారం సాయంత్రం జాతీయ బి.సి. సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బి.పి.మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బి.సి.సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రఘురాముడు, నియోజకవర్గ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు వీరన్నలు మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడిన జ్యోతిబాపూలే, బాబాసాహెబ్ అంబేద్కర్, బీపీ మండల్ కాన్సిరాం, మూలయంసింగ్ లాంటి మహనీయులను మరవరాదని వారి పోరాటాన్ని స్ఫూర్తితో తీసుకుని బహుజనులంతా ఐకమత్యంగా రాజ్యాధికారం దిశగా పయనించాలని,మనం మహనీయులకు ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు.

మిట్టకందాలలో టీడీపీ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-పాములపాడు : మిట్టకందలలో టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ జి.హరి ప్రసాద్, మల్లికార్జున, సీనారెడ్డి, నారాయణరెడ్డి, మధు, టీడీపీ మాజీ అధ్యక్షులు సి హరినాథ్ రెడ్డి జనసేన-నాగేశ్వరరావు, రాముల ఆధ్వర్యంలో టీడీపీ శంకరావం కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గిత్తా జయసూర్య పాల్గొని పార్టీ మేనిఫెస్టో, సూపర్-6 పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జయసూర్య మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఒక అవకాశం అని జగన్‌కి ఒక ఓటేస్తే ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకుండా అభివృద్ధి సంక్షేమ పథకాల మభ్య పెట్టారని ఆరోపించారు.మే 13న జరగనున్న ఎన్నికలలో వైసీపీకి బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఇరిగెల

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనసేన తాలూకా ఇన్చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, సోదరుల ఆధ్వర్యంలో ముఖ్యమైన జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జనసేన-టీడీపీ కూటమి అభ్యర్థుల విజయంలో అనుసరించాల్సిన వ్యూహం పై చర్చించారు. రానున్న ఎన్నికల్లో వైకాపాకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మబూబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, ఆదివారం 14, ఏప్రిల్ 2024

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం - సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-ఆస్పరి: మండల పరిధిలోని కైరిప్పల గ్రామంలో శ్రీకాళికా మాత, శ్రీ వీరభద్ర స్వాముల వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వర్గీయ కామ్రేడ్ పుప్పాలదొడ్డి బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అన్నారు. కైరిప్పలలోని మెయిన్ బజాంలో కొన్ని రోజులుగా స్వర్గీయ బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. శనివారం వీరభద్ర స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకొని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీఐ హనుమంతప్పల చేతుల మీదుగా చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈసందర్భంగా బి.గిడ్డయ్య మాట్లాడుతూ కారుమంచి పీర్కాగ్రామాల్లో భూస్వామ్య పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి, గ్రామాల్లో అంటరానితనానికి, కుల వివక్షత నిర్మూలనకు కృషిచేసి, నిరుపేదలకు అండగా నిలిచి అమరుడైన కామ్రేడ్ పుప్పాలదొడ్డి బండమీద వెంకటేశ్వర్లు పేరుమీద కొంతమంది యువకులు సేవాసమితి ఏర్పాటు చేసి పలుసేవా కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కైరిప్పలలో 9 రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనే భక్తులు, ప్రజలకు మంచినీరు, మజ్జిగను సేవా సమితి సభ్యులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య,సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, మాజీ సర్పంచ్ శరవన్న, మాజీఎంపీటీసీ రవీంద్ర, రైతు సంఘం నాయకులు అంజినయ్య, బంట్రోతు శీనప్ప,రంగన్న, వీరేష్, మారెన్న గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఆయారాం- గాయారాంలు -నిత్యం కండువలు వేసి ఆహ్వానిస్తున్న పార్టీల నేతలు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగడంతో పాటు అన్ని పార్టీలు అభ్యర్థులను నిర్ణయించి ప్రకటనలు చేస్తుండటం వలన పార్టీలో సీటు రాని వాళ్ళు, రకరకాల కారణాల వలన టీడీపీ-వైసీపీలో నుండి బయటకు పోయే వారు పోతుంటే వచ్చేవారు వస్తుండటం వలన ఆయారాం -గాయారాంలతో పార్టీ కార్యాలయాలు కళకలలాడుతున్నాయి. జిల్లాలో పార్టీ మారిన వారి సంఖ్య ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. ఎంపీ, మంత్రి ,ఎమ్మెల్యేల స్థాయి వారితోపాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు , పార్టీలు మారుతూ ఎవరు ఎప్పుడు ఏపార్టీలో ఉన్నారో తెలియని అయోమయ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. ఎన్నికలు సమీపిస్తుం డటంతో అధికారపార్టీకి చెందిన ఆలూరు ఎమ్మెల్యే మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ సంజీవకుమార్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ బొజ్జమ్మ, రామచంద్రనాయుడు ,అధికారపార్టీకి చెందిన పెద్దఎత్తున ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, కౌన్సిలర్‌లు టీడీపీలో చేరగా, టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ మసాల పద్మ, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ,నాయకులు వైకుంఠం మల్లిఖార్జున, మాజీ జడ్పీటీసీలు, నాయకులు వైసీపీలో చేరగా, బీజేపీకి చెందిన నాయకులు భూమా కిషోర్‌శేఖర్‌రెడ్డి వైసీపీలో చేరారు. అధికారపార్టీకి చెందిన నందికొట్కూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్ , కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఎన్నికల వేళ కావడంతో అనేక మంది వివిధ పార్టీలో సీటు ఆశించి పార్టీలు మొండిచెయ్యి చూపించడంతో మరోపార్టీలో చేరడం ప్రస్తుతం సర్వసాధారణమైంది. చొక్కాలు మార్చినంత సులువుగా పార్టీలు మారుతున్నారు. టీడీపీ పార్టీలో చేరిన నేతలు అధినేత చంద్రబాబునాయుడు, ప్రదాన కార్యదర్శి లోకేష్ సమక్షంలో, వైసీపీలో చేరిన నేతలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో చేరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ నేతలు ఇతర పార్టీల వారిని తమ పార్టీలోకి ఆహ్వానిస్తు చేరికలను ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఎవరు ఏప్పుడు ఏపార్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారపార్టీ నేతలు పార్టీలు మారిని వారిని అధికారపార్టీకి చెందిన నేతలు పోలీసులతో పోన్‌ల ద్వారా బెదిరించి తిరిగి సొంత గూటికి చేరాలని లేనిపక్షంలో కేసులు పెడతామని భయాందోళనకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఏది ఏమైనా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎవరు ఏప్పుడు ఏపార్టిలో ఉంటారో కూడా తెలియని పరిస్థితులలో కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన అనూష

విశాలాంధ్ర-దేవనకొండ: మండల పరిధిలోని తెర్నెకల్ గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన కిరణ్, జయలక్ష్మి దంపతుల కూతురు తమ్మిశెట్టి అనూష మహాత్మా జ్యోతి బాపులే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల, ఆరెకల్‌లోని సీనియర్ ఇంటర్ ఎంపీసీ 1000/965 మార్కులు సాధించి అనూష కళాశాల టాపర్‌గా నిలిచారని ప్రిన్సిపాల్ యమునదేవి అన్నారు. మంచి మార్కులు సాధించి గ్రామానికి మంచిపేరు తీసుకురావడంతో తల్లి దండ్రులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్ ఫలితాల్లో అనురాధ ప్రతిభ

విశాలాంధ్ర-క్రిష్ణగిరి: క్రిష్ణగిరి మండలం, తొగర్చేడు గ్రామ మజరా గ్రామమైన యాగంటి పల్లి గ్రామానికి చెందిన ఎరుకుల శంకర్ కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు తల్లిదండ్రులు తెలిపారు. బైపీసీ గ్రూప్ తీసుకొని 440 మార్కులు కాను 425 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. అనురాధ పది వరకు వెల్దుర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు బాలికల సంక్షేమ వసతి లో ఉంటూ పదో తరగతిలో మంచి మార్కులు వచ్చాయన్నారు. అలాగే ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం మహాత్మాజ్యోతిరావు పూలేరెసిడెన్షియల్ బాలికల కళాశాల, నెరవాడ చదివి పాణ్యం మండలం టాపర్ గా నిలిచినందుకు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

మట్టిలో మాణిక్యం-ఆర్.రక్షిత్‌రెడ్డి

విశాలాంధ్ర-పత్తికొండ: మండల పరిధిలోని కోతిరాళ్లకు చెందిన సురేంద్రనాథ్ రెడ్డి, లావణ్య దంపతుల కుమారుడు ఆర్.రక్షిత్‌రెడ్డి శుక్రవారం వెలువడిన ఫలితాల్లో ఇంటర్ మీడియట్ ప్రథమ సంవత్సరంలో చక్కని ప్రతిభ కనబరిచి సత్తా చాటాడు.కర్నూలు నారాయణ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం 470 మార్కుల కు గాను 464 మార్కు లతో ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించుకున్నాడు. రక్షిత్‌రెడ్డిని గ్రామ స్తులు అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు.

20న వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర -కర్నూలు సిటీ : అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 117 ఎస్, అలియన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ కర్నూల్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని 20న సిటీ స్థాయి వ్యాసరచన పోటీలను 'ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ 'అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ ఇంటర్నేషనల్ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ ,నైస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 4-10 లోపు చిన్నారులు సబ్ జూనియర్స్, 11-15 ఏళ్ల లోపు వారిని జూనియర్స్,15 ఏళ్ళ పైబడిన వారిని సీనియర్స్ గానూ పరిగణిస్తారన్నారు. ప్రధమ ద్వితీయ తృతీయ బహుమతితో పాటు కన్సోలేషన్ మరియు నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 16 వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 9396 861308 నంబరును సంప్రదించాలని కోరారు.

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర-కోసిగి: తెలుగుదేశం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి చూడండి అభివృద్ధిచేస్తామని ఆ పార్టీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, జ్ఞానేష్, రామకృష్ణలు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కామన్‌దొడ్డిలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చట్టసభల్లో 33% రిజర్వేషన్ అమలు మరియు 50 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి రూ.4 వేల పెన్షన్, చంద్రన్న బీమా కింద రూ.10 లక్షలు ఇన్సూరెన్స్, బీసీలందరికీ చంద్రన్న పెళ్లి కానుక రూ.లక్ష, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు. మహాశక్తి ఇంటింటికి మంచినీరు అన్నదాత పూర్తి ఇవ్వగలము బీసీలకు రక్షణ చట్టం వంటి సౌకర్యాలు కల్పిస్తారన్నారు. మీ అమూల్యమైన రెండు ఓట్లను ఒక ఓటు ఎమ్మెల్యే అభ్యర్థి అయిన రాఘవేంద్ర రెడ్డికి , మరో ఓటు ఎంపీ అభ్యర్థి అయిన పంచలింగాల నాగరాజు కు సైకిల్ గుర్తుపై వేసి టీడీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. నాయకులు ఈరన్న,ఈడిగ మల్లయ్య, దొడ్డయ్య, సిద్ధప్ప, ఈరయ్య, వెంకటరెడ్డి, మల్లారెడ్డి, అయ్యప్ప, నాగరాజు , ఎంకప్ప , మల్లికార్జునలు పాల్గొన్నారు.

బడుగు వర్గాల అభ్యున్నతికి టీడీపీ కట్టుబడి ఉంది

విశాలాంధ్ర-తుగ్గలి: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకై కృషి చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీని మాజీ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం ఉదయం ఉప్పర్లపల్లి బాట తండా సచివాలయ గ్రామాల్లో గడపగడపకు తిరుగుతూ సూపర్ సిక్స్ మేనిఫెస్టోని ప్రజలకు వివరించారు. సాయంత్రం పగిడిరాయిలో జయహో బీసీ సభను నిర్వహించారు. బీసీల అభివృద్ధి కొరకు గతంలో చేసిన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం బత్తిన వెంకటరాముడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ, జనసేన- బిజెపి కూటమి పార్టీలతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. రాష్ట్ర భవిష్యత్తు గాడిలో పడాలంటే కూటమి పార్టీలనే గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నక్కరాతి దామోదర్, వెంకటపతి, రామునాయక్, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, డీలర్ సుంకన్న, అప్పా వేణు, కొత్తూరు శివరాముడు,మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ బాలన్న వెంకటస్వామి తదితర మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సెలవు దినాల్లోనూ పన్ను వసూలు కేంద్రాలు

రెవిన్యూ ఆఫీసర్ కె ఎం డి జునైద్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : ఈ నెల చివరి వరకు నగర పాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూలు కేంద్రాలు సెలవు దినాల్లోనూ పనిచేస్తాయని రెవిన్యూ అధికారి కె ఎం డి జునైద్, మేనేజర్ చిన్నరాముడు తెలిపారు. ఈ నెలాఖరులోపు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ఏకమొత్తంగా చెల్లించిన పన్నుదారులు 5 శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రెండవ శనివారం పన్ను వసూలు కేంద్రాలలో రూ.25.54 లక్షలు ఆస్తి పన్ను, రూ.2.87 లక్షలు కుళాయి పన్ను వసూలు అయినట్లు రెవిన్యూ ఆఫీసర్ కె ఎం డి జునైద్ చెప్పారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మంచినీటి పరిష్కారంలో మూనాళ్లే ముచ్చటే

విశాలాంధ్ర-చిప్పగిరి: నంచర్ల గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారంలో మూన్నాళ్లే ముచ్చటగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని నంచర్లకు తీవ్ర మంచి నీటిఎద్దడి ఉన్నప్పటికీ ఏఒక్క ప్రజా ప్రతినిధి శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచర్ల గ్రామానికి రిజర్వాయర్లు, కాలువలు, పైప్ లైన్ ద్వారా గాని నీరు సరఫరా చేయడం లేదని, గ్రామంలోనే ఉన్న బోర్లు ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్నారే తప్ప నీటి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చూపలేకపోయారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. రెండు రోజులకు ఒకసారి బోర్లు పాడైపోతున్నాయన్నారు. ఆబోర్లు మరమ్మత్తులకు నోచుకునేందుకు 5, 6 రోజులు సమయం పట్టడంతో గ్రామంలో తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడుతుందని దీంతో గ్రామ ప్రజలు వ్యవసాయ బావి బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నీరు లేక వెలవెలబోతున్న నీటి తొట్టీలు

విశాలాంధ్ర -హొళగుంద : బన్నీ మహంకాళి అమ్మ దేవి ఆలయం వద్ద అధికారులు ఉపాధి నిధులతో నీటి తోటి నిర్మించారని నీటి తోటి నాసిరకంతో నిర్మించడం వల్ల చీలిపోయిందని ప్రజలు ఆరోపించారు. నీటితొట్టి దెబ్బ తినడంతో నీరు నిల్వ ఉండటం లేదు. దీంతో పశువులకు నీటి కొరత ఏర్పడిందని పశువుల యజమానులు వాపోయారు.మండుతున్న ఎండలకు పశువులకు నీటి దాహం తీర్చాలంటే కష్టంగా ఉన్నదన్నారు. నీటి తొట్టికి అధికారులు మరమ్మతు చేయకుండా నీటిని నింపకుండా వదిలివేశారని ప్రజలు పేర్కొన్నారు.నీటితోటిని మరమ్మతు చేసి నీటిని నింపాలంటూ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. నీటితో నీళ్లనింపితే పశువులతో పాటు పశుపక్షులకు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని విద్యావంత యువకులు చేశారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి నీటి తొట్టిలో నీటిని నింపాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

ఫేక్ న్యూస్ పై.. ఫోకస్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : సార్వత్రిక, లోక్ సభ ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లో భాగంగా... సోషల్ మీడియాలో ప్రసారమయ్యే కథనాలపై ఎన్నికల కమీషన్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం ఎలెక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, లా అండ్ ఆర్డర్, ఎన్నికల సమగ్రత, ఎన్నికల ప్రణాళిక/నిర్వహణ తదితర అంశాలపై నకిలీ కథనాల ప్రచురణ, ప్రసారాన్ని ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించడంగా పరిగణించబడుతుందని జిల్లాకలెక్టర్ తెలిపారు.ద్వేషపూరిత ప్రసంగం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు మొదలైన సందేశాలు సోషల్ మీడియాలో ప్రసారం అయితే.. అలాంటి వాటిని చట్టవ్యతిరేకమైన సందేశాలుగా గుర్తించి.. సంబంధిత సందేశాలను పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.. ఎలాంటి సందేశాలు ఎలాంటి చట్ట వ్యతిరేకతకు దారితీస్తాయి, అందుకు కారకులైన వారికి చట్టపరంగా ఏయే సెక్షన్లు వర్తిస్తాయి ? అనే వివరాలు ఈ క్రింది విధంగా ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

అధ్వాన స్థితిలో బస్సు షెల్టర్ - పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-హొళగుంద : మండలంలోని సులువాయి లో మాజీ ఎంపీ కేఈ కృష్ణమూర్తి ఎంపీగా ఉన్నప్పుడు లక్ష రూపాయలతో బస్ షెల్టర్ అధికారులు నిర్మించారు. బస్ షెల్టర్ ఫ్లోరింగ్ దెబ్బ తినడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా మారింది. బస్సు షెల్టర్ ఫ్లోరింగ్ దెబ్బతినడంతో పశువులు ఆశ్రయం పొందడంతో పశువుల పాకగా మారిందని ప్రజలు వాపోతున్నారు. బస్ షెల్టర్లు ప్రజలకు అనువుగా లేని చోట నిర్మించడం వల్ల చెత్తాచెదారంతో నిండిపోయిందని ప్రజలు అంటున్నారు. బస్సుషెల్టర్లు నిండిన చెత్తచెదారాన్ని అధికారులు ఎత్తివేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. బస్సుషెల్టర్ ఫ్లోరింగ్ దెబ్బ తినిందని వెంటనే మరమ్మతు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడే బస్సుషెల్టర్‌గా చూడాలని ప్రజలు కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - కౌతాళం : కర్ణాటక ప్రాంతం నుండి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తులపై దాడి చేసి పట్టుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మిగనూరు డిఎస్పి సీతారామయ్య, కోసిగి సీఐ ప్రసాద్ ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా కర్ణాటక మద్యం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు వివరించారు. అందులో భాగంగానే గోతులదొడ్డి గ్రామానికి చెందిన నగేష్ ,హనుమేష్, దుర్గయ్య అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా బాపూరం చెక్పోస్ట్ వద్ద దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నట్లు వివరించారు ఈదాడిలో 20 బాక్సుల కర్ణాటక మద్యంతోపాటు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.కర్ణాటక మద్యం విలువ సుమారు 3 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. కర్ణాటక మద్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆమె మరణించినా బతికే ఉంది - అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబసభ్యులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : అనారోగ్య కారణాల చేత ఇంటి ఇల్లాలు మరణించి పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ వారి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో స్ఫూర్తి ధాయకమైంది. కడప జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన దొంతు కృష్ణవేణి (38) గృహిణి. గురువారం ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు ఆసుప్రతికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రైవేట్ వైద్యశాల కర్నూలుకు తరలించారు. రోగిని పరీశీలించిన వైద్యులు తలలో బ్లడ్ క్లాట్ (రక్తం గడ్డ కట్టడం)ను గుర్తించారు. ఆమెను రక్షించడానికి రెండు రోజులుగా వైద్యులు ఎంతో శ్రమించారు. కానీ దురదృష్టవశాస్తూ శనివారం ఉదయం బ్రెయిన్ డెడ్ అయింది. తదనంతరం అవయవదానంపై అవయవదాన సమ న్వయ కర్తలు మృతురాలి కుటుంబ సభ్యులకు, బంధువలకు అవగాహన కల్పించారు. అనంతరం భర్త, కుటుంబ సభ్యుల అంగీకారంతో లివర్, కిడ్నీలు, గుండె దానం చేశారు. చనిపోతూ కూడా మరో నలుగురికి ప్రాణదానం చేయడం మాకు గర్వంగా ఉందని మృతురాలి భర్త, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం జీవన్ ధాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రాంబాబు ఆధ్వర్యంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రీన్ ఛానెల్ ద్వారా లివర్, గుండెను వాయు మార్గంలో తిరుపతికి తరలించారు. కిడ్నీని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని జీవన్ ధాన్ కమిటీ సభ్యులు తెలిపారు. ఆమె పార్థివదేహం తరలించే ముందు సదరు ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది గౌరవ వందనం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత-మోటార్ సైకిల్ సీజ్..నిందితులు పరారీ

విశాలాంధ్ర-కోడుమూరు: కోడుమూరు సెబ్ కార్యాలయ పరిధిలోని సి.బెళగల్ మండలం సంగాల గ్రామం వద్ద అదే గ్రామానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై 7 బాక్సుల్లో కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు కోడుమూరు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. ఈ మేరకు శనివారం సీఐ విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి,జిల్లా ఎస్పి కృష్ణకాంత్,అడిషనల్ ఎస్పీ నాగరాజుల ఆదేశాలతో జిల్లా ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఎస్ రవికుమార్ సూచనల మేరకు సి బెళగల్ మండలంలోని సంగాల దగ్గర ద్విచక్ర వాహనంపై 7 బాక్సుల్లో 672టెట్రా ప్యాకెట్ల కర్ణా టక రాష్ట్ర మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. అయితే కర్ణాటక అక్రమమద్యాన్ని ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న వ్యక్తి పరారయ్యాడన్నారు. మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని సంగాలకు చెందిన బోయ రంగన్నగా గుర్తించామన్నారు.నిందితుడుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నామని చెప్పారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.కాగా పట్టుకున్న కర్ణాటక మద్యం విలువ సుమారు రూ.42వేలు ఉంటుందన్నారు.

నాటుసారా సీజ్ : వెల్దుర్తి మండలంలోని రత్నపల్లె గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్వర్లుగౌడ్ అనే వ్యక్తి వద్ద నుంచి 10లీ టర్ల నాటుసారా సీజ్ చేసి, అరెస్ట్ చేసినట్లు సీఐ రామాంజనేయులు పేర్కొన్నారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితుడు ఈడిగ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి డోన్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా,14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.నాటుసారాకేసులో నిందితుడిని డోన్ సబ్ జైలుకు తరలించామన్నారు.ఈ దాడులలో ఎస్ఐ అలిబేగ్,హెడ్ కానిస్టేబుల్ హనుమంతు,కానిస్టేబుళ్లు శంకర నాయక్, వెంకటేష్ నాయక్, అఫ్రోజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

విశాలాంధ్ర-కౌతాళం: విద్యార్థులు ఒక లక్ష్యంతో చదివినప్పుడే మీరు అనుకున్నది సాధించగలరని సమాజంలో ఓ ఉన్నత స్థానం పొందగలరని మండల విద్యాశాఖ అధికారిని-2 శోభారాణి అన్నారు. శనివారం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థి క్రమశిక్షణ నైతిక విలువలు కలిగిన విద్యను నేర్చుకున్నప్పుడే తల్లిదండ్రులకు కానీ పాఠశాలకు గాని విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు మంచి గుర్తింపు వస్తుందని సూచించారు. పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయి అబాకాస్ ఒలంపియాడ్, టాలెంట్ టెస్టులో 3,4,5 తరగతుల వారికి, టార్గెట్ ఐఐటి సంస్థ వారు నిర్వహించిన పరీక్షలలో, ఆదోని డివిజన్ స్థాయి లక్ష్మమ్మ అవ్వ ఆధ్యాత్మిక కేంద్రం వారు నిర్వహించిన క్విజ్ పోటీలలో ద్వితీయస్థానం సంపాదించిన విద్యార్థి, ఇతర పోటీ పరీక్షల్లో మొదటి, ద్వితీయ, స్థానాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ సయ్యద్ దూద్‌భాష మాట్లాడుతూ మారుమూల గ్రామంలోనూ అన్ని సౌకర్యాలతో పాఠశాలలో ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను పట్టణ పాఠశాలలకు దీటుగా అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో రాబోయే విద్యా సంవత్సరంలో పాఠశాలలో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, పాఠశాల సెక్రెటరీ సయ్యద్ మైనుద్దీన్, పర్యవేక్షకులు జయలక్ష్మి ,రాజు, భీమేష్, సబిహా, సీనియర్ ఉపాధ్యాయులు ఈరన్న, పరమేష్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఆనవాయితీ ప్రకారమే టికెట్ కేటాయించాలి

విశాలాంధ్ర-ఆదోనిరూరల్: కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ఉంటూ ప్రజా శ్రేయస్ కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందని, శాసనసభ ఎన్నికల టికెట్ కూడా ఆనవాయితీ ప్రకారమే అప్లికేషన్ వేసుకున్న పార్టీ నాయకులకు మాత్రమే టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనిత్, యువజన సంఘం నాయకులు దేవిశెట్టి వీరేష్, పార్టీ సీనియర్ నాయకులు బండారి తాయన్న డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో వారు మాట్లాడుతూ పార్టీ ఎమ్మెల్యే టికెట్ అప్లికేషన్ వేసుకున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులను కాకుండా మరో కొత్త వ్యక్తులకు టికెట్ కేటాయిస్తారని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం సరైంది కాదన్నారు. అధిష్టానం పార్టీని నమ్ముకున్న నాయకులకు న్యాయం చేసి తీరుతుందని అభిప్రాయపడ్డారు. ఆదోని నియోజకవర్గంలో సుదీర్ఘంగా 40 ఏళ్లపాటు కాంగ్రెస్ పార్టీ జెండాను మోసిన నాయకులు ఆరు మంది ఎమ్మెల్యే టికెట్ కు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని రాష్ట్ర వర్కింగ్ కమిటీ పూరి స్థాయిలో విచారణ చేసి టికెట్లు కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీని నమ్ముకున్న నాయకులకు న్యాయం చేయాలంటే అప్లికేషన్ వేసుకున్న నాయకులకే క్రికెట్ కేటాయించి తీరాలని డిమాండ్‌చేశారు.ముస్లిం మైనార్టీలకే టికెట్ కేటాయించాలిలిబీ ఆదోని నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన ముస్లిం మైనార్టీలకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించే తీరాలనే ముస్లిం మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంఎండి నూర్ ప్రకటన ద్వారా మీడియాకు తెలియజేశారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైరల్ అవుతున్న వ్యక్తి ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి మేనల్లుడని, ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి ప్రోద్బలంతోనే టికెట్ కేటాయించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడం వాస్తవమేనన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వెక్కిగిన అభ్యర్థిని అయితే డిపాజిట్ దక్కించుకునే పరిస్థితులు కూడా కనిపించడం లేదని ప్రశ్నించారు.

ప్రాజెక్టులు పూర్తి చేయని వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపుతాం

విశాలాంధ్ర-దేవనకొండ : ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి కబ్జాలు దాడులతో ప్రజలు విసిగిపోయారని కూటమి నాయకులు పేర్కొన్నారు.జనసేన ఆలూరు ఇంచార్జి వెం కప్ప, టీడీపీ ,బిజెపి, జెఎస్పీ పార్టీల కూటమి ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ, మాజీ జటీపీటీసీ బొజ్జమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, బీజేపీ జిల్లా నాయకులు లోక్ సత్తాపార్టీ నాయకులు రామదాసు గౌడ్, శనివారం జనసేన పార్టీ ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి విస్తృతస్థాయి సమావేశం దేవనకొండ పాండురంగ ఫంక్షన్ నందు ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నియోజక అభివృద్ధి ఎంతవరకు చెందిందన్నారు.వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు, వైసీపీ నాయకుల కమిషన్ల కకుర్తితో పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి వైసీపీ దుర్మార్గ పాలన పోవాలంటే కూటమి నాయకులు కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్రగౌడ్ , పార్లమెంట్ అభ్యర్థి నాగరాజు సైకిల్ గుర్తుపై ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ఆలూరు ప్రజలపై ఎంతైనా ఉందన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, ఆదివారం 14, ఏప్రిల్ 2024

ప్రశాంత ఎన్నికల నిర్వహణయే పోలీసుల ధ్యేయం-జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే పోలీసుల ధ్యేయమని అందువల్ల ప్రజలు కూడా రానున్న ఎన్నికల్లో స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం నందు ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఆళ్లగడ్డ స్థానిక పోలీసులతో పట్టణంలోని పలు ప్రాంతాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించరాదని, ప్రజలు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకే పోలీసులతో కవాతు నిర్వహించడం జరుగుతుందన్నారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకొనుటకు, నిర్భయముగా భయపక్షపాతాలు లేకుండా ఉండేందుకు పోలీసు వారు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటారని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కావద్దని,ఎక్కడ ఎలాంటి గొడవలు,అల్లర్లు జరుగకుండా అన్నిచర్యలు తీసుకోవడం జరిగిందని, కొందరిని బైండోవర్ చెయ్యడం జరిగిందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని.. కుల, మత, వర్గాల మధ్య విద్వేషాలకు విభేదాలకు దారి తీసే విధంగా ప్రసంగాలు చేయరాదని మరియు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదన్నారు. తప్పుడు సమాచారాన్ని లేదా తెలియని సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా మరి ఏ ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాప్తి చేయరాదు. మార్ఫింగ్ చేసిన ఫోటోలు వీడియోలు పెట్టరాదన్నారు. వివాదాస్పద పోస్టింగులు వాట్సాప్ లలో పెట్టినట్టయితే అడ్మిన్లే బాధ్యత వహించవలసి ఉంటుంది. ఎవరైనా ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించిన యెడల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ డి.ఎస్.పి ఎస్.షర్ఫుద్దీన్, ట్రైనింగ్ డిఎస్పి రఘువీర్ , సీఐలు రమేష్ బాబు,హనుమంత్ నాయక్, ఎస్సైలు నగిన, నరసింహులు, కేంద్ర సాయుధ బలగాల అధికారులు వారి సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నందికొట్కూరులో టీడీపీ విజయం ఖాయం-బీద రవిచంద్ర

విశాలాంధ్ర - నందికొట్కూరు : సార్వత్రిక ఎన్నికలలో నందికొట్కూరు నియోజకవర్గం లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య విజయం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని జూపాడుబంగ్లా మండలం తూడిచెర్ల గ్రామ వైసీపీ నాయకులు నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి , టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి , నంద్యాల జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ సమక్షంలో వైసీపీ సర్పంచ్ బాల మద్దిలేటి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో భారీగా చేరారు. వారికి టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజవర్గంలో ఇప్పటికే వైసీపీ ఖాళీ అయిందని రాష్ట్రంలో సైకో ముఖ్యమంత్రి మోసపూరితమైన వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధిని తుంగలో తొక్కి ప్రజలపై అనేక భారాలు మోపడం జరిగిందన్నారు. సైకో ముఖ్యమంత్రిని ఇంటికి పంపించేందుకు సమయం ఆసన్నమైందన్నారు. కాబట్టి రేపు జరిగే ఎలక్షన్లలో రాష్ట్రంలో టీడీపీ విజయ డంక మోగిస్తుందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య ఈనెల 22న నామినేషన్ వేస్తారని, నందికొట్కూరులో జయ సూర్య ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఈనెల 15వ తేదీ సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు నందమూరి బాలకృష్ణ రోడ్ షో కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమానికి టీడీపీ కార్యకర్తలు అభిమానులు నాయకులు ప్రతి గ్రామంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ముఖ్యనాయలు వైసీపీ సర్పంచ్ బాల మద్దిలేటి తో పాటు తన అనుచరులు సత్యమయ్య ,వెంకటేశ్వర్లు ,తలారి రాముడు ,మాలిద్ర, చిన్న వెంకటస్వామి, ఎల్లాల ఈశ్వరయ్య, హనుమంతు, ఎల్లాల వెంకటేశ్వర్లు, ఎల్లాల రామచంద్రుడు, పాలమర్రి నారాయణ, గండు బాలకృష్ణ, బాల ఈశ్వరయ్య, పెద్ద నారాయణ, బాల వెంకటేశ్వర్లు, కుమ్మరి అయ్యన్న, కుమ్మరి ఆంజనేయులు, అద్దాల పుల్లయ్య, కొట్టాల వెంకటరమణ, చెల్లా లక్ష్మిరెడ్డి, మహమ్మద్, శ్రీనివాసులు, నాగేంద్ర గౌడ్ ,మహబూబ్ బాషా ,బండి సుబ్బయ్య ,తలారి సుబ్బయ్య, తలారి రమణయ్య ,నాగరత్నం, బొందలి శివుడు ,మంగలి రమణయ్య, మంగలి వెంకటేశ్వర్లు, మంగలి శ్రీను ,కాలం రాజు, చిరంజీవి నాయుడు, బియ్యం వెంకటేశ్వర్లు,, రాజశేఖర్ ,వెంకటేశ్వర గౌడ్, మహేష్ ,జయ రాములు ,ఆళ్లగడ్డ వెంకటరమణ ,మంచాలకట్ట సుబ్బయ్య, మధు, చరణ్ కుమార్, కార్తీక్ బాబు, కిరణ్, తదితరులు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగినది.

టీడీపీ సర్పంచు..ఎంపీటీసీ వైసీపీలోకి చేరిక

విశాలాంధ్ర-ఆస్పరి : లంచాలు, వివక్షతకు తావు లేకుండా విప్లవాత్మక మార్పులు, సంస్కరణలతో పేదల ఆకాంక్షకు అనుగుణంగా గొప్ప పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికే ప్రజలు మద్దతు ఉన్నట్లు కర్నూలు పార్లమెంటు వైయస్సార్సీపి అభ్యర్థి బివై రామయ్య ఆలూరు అసెంబ్లీ వైయస్సార్సీపి అభ్యర్థి విరుపాక్షి లు అన్నారు. శనివారం మండల పరిధిలోని ములుగుందం గ్రామంలో వైసిపి ఎంపీ అభ్యర్థి బివై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి సమక్షంలో టిడిపి ఎంపీటీసీ-2 వీణారెడ్డి, మనోహర్ రెడ్డి, టీడిపి సర్పంచ్ శ్యామలమ్మ, ఏసోబు దంపతులతో పాటు మరో 100 కుటుంబాలకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఆలూరు అసెంబ్లీ నుండి బిసినే విరుపాక్షి, కర్నూలు పార్లమెంటు సభ్యునిగా బివై.రామయ్యను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి రాగానే ఆస్పరి మండలంలోని జోహారపురం గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ సంపు ఏర్పాటు చేసి మండలానికి నీరు సరఫరా చేస్తామన్నారు. ప్రజలకు మేలు చేసి ఉంటే మళ్ళీ ఆశీర్వదించాలని ప్రజలను కోరిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ముఖ్యమంత్రి అందించిన సంక్షేమ పథకాలు చూసి టిడిపి నాయకులు వైసిపి ప్రభుత్వం లోకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ తాలూకా నాయకులు వైకుంఠం మల్లికార్జున, శశికళ, కృష్ణమోహన్, జెసిఎస్ జిల్లా కన్వీనర్ సురేంద్ర రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ సౌమ్యారెడ్డి, ఆలూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాఘవేంద్ర, ఆస్పరి, దేవనకొండ జెడ్పిటిసిలు దొరబాబు, కిట్టు, ఆస్పరి, చిప్పగిరి మండల కన్వీనర్లు పెద్దయ్య, మార్యయ్య, సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్, మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బసవరాజు, శివ,సర్పంచ్ నెలురప్ప, హరికృష్ణ, వెంకటేష్,ఎంపీటీసీ రాధాక్రిష్ణ, కరుణాకర్, చిన్నాయప్ప, వైయస్సార్సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఎల్లప్ప, గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయండి

విశాలాంధ్ర-చాగలమర్రి : చెక్ పో స్టులలో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎస్పి రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. శని వారం రాత్రి చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోకి ప్రవేశించు అన్ని మార్గాలలో చెక్‌పోస్టలను ఏర్పాటు చేసి అక్రమంగా నగదు, మద్యం,గంజాయి మొదల గునవి జిల్లా లోకి ప్రవేశించకుండా నిరంతరం తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రశాంత ఎన్నికల లక్ష్యంగా పోలీస్ అధికారులు అన్నిచర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఎన్నిక లు సమీపిస్తున్న తరుణం లో అక్రమ రవాణాకు అడ్డుకునేందుకు జిల్లా సరి హద్దులలో చెక్పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిం దని, చెక్పోస్టులలో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలను ప్రలోభాలకు గురి చేయుటకు అక్రమంగా నగదు ,మద్యం ,బంగారం, వెండి, గంజాయి, విలు వైన వస్తువులు మొదలగునవి రవాణా కాకుండా అడ్డుకట్ట వేయాలన్నారు.అందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని , ఏదైనా అనుమానం వస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమం లో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి సంతోష్, స్పషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు,చాగలమర్రి ఎస్సై రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జహీద్ బిన్ మహమ్మద్ మృతికి నివాళులర్పించిన - బైరెడ్డి శబరి

విశాలాంధ్ర-బనగానపల్లె: జిల్లా భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోక్ష నంద్యాల జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జాహిద్ బిన్ మహమ్మద్ గుండెపోటుతో అకాలమరణం చెందడం జరిగింది.విషయం తెలుసుకున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి, వారి యొక్క పార్తివ దేహాన్ని సందర్శించి భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు ధైర్యాన్ని కల్పించి ఒక గొప్ప మంచి వ్యక్తి భారతీయ జనతా పార్టీ కోల్పోయింది అని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అసెంబ్లీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సుల్లో జిల్లా ప్రథమ స్థానం శ్రీదీపా కళాశాల

విశాలాంధ్ర-ఆత్మకూరు టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలలో శ్రీదీప బాలికల జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను చాటారు. ఈ కళాశాల నందు నిర్వహించబడుతున్న వృత్తి విద్యా కోర్సులైన ప్రీస్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్స్, వెటర్నరీ కోర్స్ నందు పరీక్ష రాసిన విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులైనట్టు కళాశాల ప్రిన్సిపల్ బి వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్స్ ఫలితాలలో మా కళాశాలకు చెందిన కె. నిరోషా 900/1000 మార్కులతో జిల్లా స్థాయి ప్రథమ స్థానం జె. గిరిజాదేవి 890/1000 మార్కులకు జిల్లా స్థాయి ద్వితీయ స్థానం సాధించారు. ప్రథమ సంవత్సరం ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్సులో ఫలితాలలో బి. పద్మావతి 448/500 మార్కులు ఎస్. ఫర్హానా 430/500 మార్కులతో జిల్లాస్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. వెటర్నరీ కోర్స్ నందు జె. రాధ 446/500 మరియు సి. చంద్రకళ 446/500 మార్కులతో జిల్లా ప్రథమ స్థానం సాధించారు. సుమయ సుల్తానా 411/500 మార్కులతో జిల్లా ద్వితీయ స్థానం సాధించారు. ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ ఫలితాలలో విద్యార్థులు అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించినారు. ఈ వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ తెలిపారు. ఈ విజయానికి కారకులైన అధ్యాపకులను, విద్యార్థులను కళాశాల యాజమాన్యం దీపా నాగవేణి అభినందించారు.

స్టిక్కర్ ఎమ్మెల్యేగా ఉండను- ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్

విశాలాంధ్ర - కొత్తపల్లి: తాను ఇకనుంచి స్టిక్కర్ ఎమ్మెల్యేగా ఉండదల్చు కోలేదని, ప్రజా సేవకే తన జీవితం అంకితం చేసేందుకు నిర్ణయించుకున్నానని, ఈసారి ఎన్నికల్లో తనకు ఓటేసి మీ సేవకుడిగా ఎన్నుకుని మరోసారి అవకాశం కల్పించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ అన్నారు. ఈమేరకు కొత్తపల్లి మండలం లోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన సప్తనదుల సంగమేశ్వర క్షేత్రంలో వేప దారు లింగానికి శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించి సమీపంలోని జానాల గూడెం, బలపాల తిప్ప, సిద్దేశ్వరం, కపిలేశ్వరం, పాతమాడుగుల గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెత్తందారుల అభ్యర్థులకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి నేటి వరకు అనునిత్యం పేద ప్రజల మధ్య ప్రజా సేవకునిగా పని చేశానన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వార్థ రాజకీయ నాయకుల వల్ల నిజాయితీ, విలువలు గల నాయకులకు టికెట్లు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సేవకునిగా ప్రజల మధ్య చిరస్థాయిగా ఉండాలన్న తన సంకల్పాన్ని తాకట్టు పెట్టుకోవడం తనకు ఇష్టం లేదన్నారు. స్టిక్కర్ ఎమ్మెల్యేగా ఉండడం కన్నా ప్రజాసేవకుడిగా ప్రజల మధ్య ఉండడమే తన లక్ష్యమన్నారు. నిజాయితీగా పనిచేసిన మంచి నాయకులకు వైసీపీ ప్రభుత్వంలో విలువలు లేవని, విలువలు లేని పార్టీలో ఉండలేక కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పారు. ఇందిరమ్మ రాజ్యం కోసం అందరం కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో రెండు పార్టీల్లో ఉన్న అభ్యర్థులు కనీసం గ్రామాలను కూడా గుర్తు పట్టలేని పరిస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో ఉన్న ప్రతి గడపను సందర్శించి ప్రజల యోగక్షేమాలు తెలుసుకొని ప్రతి ఒక్కరికి తన వంతు సహాయ సహకారాలు అందించానని గుర్తు చేశారు. గ్రామాల్లో ప్రచారం వెళ్లినప్పుడు ప్రతి ఇంటి నుంచి వస్తున్న ఆప్యాయత ఆధారాభిమానాలు చూస్తే వారి ప్రేమను ఎప్పుడూ మరువలేనన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పలువురిని కండువా కప్పి ఆహ్వానించారు.

టీడీపీ నుండి వైసీపీలో చేరిక

విశాలాంధ్ర -చిప్పగిరి: తెలుగుదేశం పార్టీ నుండి వైసీపీలోకి వలసలు జోరందుకున్నాయి. శనివారం మండల కేంద్రమైన చిప్పగిరిలోని ఆలూరు నియోజక వర్గం వైసీపీ అభ్యర్థి విరుపాక్షి ఆధ్వర్యంలో చేరికలు జోరందుకున్నాయి. నియోజకవర్గం హొలహర్వి మండల పరిధిలోని గూల్యంకు చెందిన టీడీపీ కార్యకర్తలు దాదాపు 50 కుటుంబాలు వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా విరుపాక్షి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో మౌలిక వసతులతో పాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాలకు మెచ్చి టీడీపీ నుండి కక్రీమల్లప్ప, రాజశేఖర్, రంగయ్య, గురుపాదప్ప, గిద్దరంగయ్య, సోమయ్య, సీతప్ప, నాగరాజు, ఉచ్చురప్ప, పంపాపతి, కళదాసు, కలదాసు , సోమలింగలకు పార్టీ కండువాలు వేసి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.

జగనన్నకు మద్దతు తెలుపుదాం-ఎంపీపీ అమరేష్

విశాలాంధ్ర -కౌతాళం : రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో ప్రతి పేదవాడికి అండగా నిలుస్తున్న జగనన్నకు మద్దతు తెలుపుదామని ఎంపీపీ అమరేష్ అన్నారు. శనివారం ఉదయం మండల కేంద్రమైన కౌతాళంలో ఎంపీపీ అమ్రేష్ మరియు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు తో కలిసి ఎస్సీ కాలనీ, అత్తర్ వీధి, మంచాల్ వీధి, పాత బస్టాండ్, కటికే వీధి, శివప్ప నగర్,కామవరం రస్తా లలో పర్యటించి ఇంటింటికి వెళ్లి జగనన్నకు మద్దతు కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానటువంటి సంక్షేమ పథకాలు కేవలం మన రాష్ట్రంలో అమలు చేయడం జగనన్నకు సాధ్యమైందన్నారు. పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించడానికి తమ వంతు పాత పోషించాలని కోరారు. వైయస్సార్సీపి మండల కన్వీనర్ ప్రహల్లాద చారి, మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మహబూబ్ సాబ్ , గ్రామ సర్పంచ్ పాల్ దినాకర్, నాయకులు వల్లూరు మరేగౌడ్, గుడికంబాలి సిద్ధన్న గౌడ్, హాల్వి చెన్నప్ప ధని, దాట్ల సుబ్బరాజు, రాఘవేందర్ రెడ్డి,అవతారం, తిక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మీ సేవకుడిగా పని చేస్తా-టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : మంత్రాలయం ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే మీకు సేవకుడిగా, మీ కుటుంబంలో ఒకడిగా పని చేస్తానని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి స్పష్టం చేశారు. శనివారం పెద్దకడబూరు మండలంలోని తారాపురం, రంగాపురం, చిన్నకడబూరు, మేకడోణ, నౌలేకల్, ముచ్చిగిరి, కల్లుకుంట గ్రామాలలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డితోపాటు టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్లు ఎమ్మెల్యేగా పని చేస్తున్న బాలనాగిరెడ్డి గ్రామాలలోని సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడబూరు కౌతాళం, మంత్రాలయం మండలాలను ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు విభజించుకొని దోచుకోవడం తప్పా అభివృద్ధి శూన్యమని ఆరోపించారు. బీసీలకు చంద్రబాబు టికెట్ ఇచ్చిన మరుక్షణమే బాలనాగిరెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. ఎమ్మెల్యే మాత్రం బయటకు గాంభీర్యంతో మాట్లాడుతున్నారని తెలిపారు. 2019 ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనతో ప్రజలను మోసం చేశారని, అలాంటి జగన్ కు, ఇక్కడి ప్రజల సమస్యలను పట్టించుకోని బాలనాగిరెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీసీలకు చంద్రబాబు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బీసీలందరూ ఐక్యంగా కృషి చేసి టీడీపీకి ఓటు వేసి బాలనాగిరెడ్డికి ఓటమి రుచి చూపించాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో మంత్రాలయం పీఠంపై టీడీపీ జెండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే ఒక్క అవకాశం ఇవ్వాలని 5 ఏళ్లలో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. మంత్రాలయంలో నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బీసీ ఓటర్ల సత్తా ఏమిటో చూపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మరుక్షణమే చంద్రబాబు అమలు చేసే ఆరు గ్యారెంటీ పథకాల ద్వారా అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, బసలదొడ్డి ఈరన్న, కోడిగుడ్ల ఏసేపు, హనుమంతరెడ్డి, విజయ్ కుమార్, తలారి అంజి, మీసేవ ఆంజనేయులు, గోనుమాను నరసన్న, కలుగొట్ల లక్ష్మన్న, దశరథ రాముడు, సుక్క నరసన్న, డీలర్ నరసప్ప, మహదేవ, హజరత్ వలి, రాఘవరెడ్డి, నరశింహులు, నాగేష్, ఈరన్న, దాసప్పరెడ్డి, తాయన్న, సర్దార్ బాషా, బొగ్గుల నరసన్న, సుధాకర్, రామన్న, సందీప్, వీరేష్ గౌడ్, మల్దకల్ , ముక్కన్న, జనసేన పార్టీ నాయకులు గణేష్ ప, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వంగా శ్రీ వీరభద్ర స్వామి రథోత్సవం

విశాలాంధ్ర-తుగ్గలి: మండల పరిధిలోని ఎద్దుల దొడ్డిలో వెలసిన శ్రీ కాళికామాత సమేత శ్రీ వీరభద్ర స్వామీల కళ్యాణ వేడుకలు శనివారం తెల్లవారు జామున 4:5 గంటలకు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో పురోహితులు ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంకాలం 5 గంటలకు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో వీరభద్ర స్వామి భక్తుల సమక్షంలో శ్రీకాళికామాత వీర భద్ర స్వామిల రథోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండుగలా గ్రామస్తులు నిర్వహించారు.14వ తేదీన ఆదివారం వాసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలియజేశారు.భక్తులు స్వామివారి కల్యాణ రథోత్సవ వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని హాజరై స్వామి వారికి మొక్కలను తీర్చుకున్నారు.

కన్నుల పండుగగా వీరభద్రుడి రథోత్సవం

విశాలాంధ్ర-ఆస్పరి : మండల పరిధిలోనే కైరిప్పల గ్రామంలో కొలిచేవారికి కొంగు బంగారంగా విరా జిల్లుతున్న శ్రీ కాళికా మాత, వీరభద్ర స్వా మి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం వీరభద్రస్వామి రథోత్సవం కన్నుల పండువుగా జరిగింది. ముందుగా ఆలయంలో వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు అనం తరం రథోత్సవం దగ్గరబలిదానం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వ హించారు. అనంతరం వందలాదిమంది భక్తి జనుల మధ్య రథోత్సవాన్ని ముందుకు లాగారు. ఎదురు బసవన్న గుడి వరకు లాగి అక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహించి తిరిగి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ రథోత్సవ వేడుకల్లో ఆలూరు వైసీపీ అభ్యర్థి విరుపాక్షి, టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ లు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

మే 15 నుండి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ దరఖాస్తు కోసం మే 15 నుంచి కళాశాలలో చేరే విద్యార్థిని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చుని ఆర్ఐఓ గురవయ్య శెట్టి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లాస్ట్ డేట్ దరఖాస్తు జూన్ 1 వరకు ఉంటుందన్నారు. ఫస్ట్ ఫేస్ కింద జూన్ -1, సెకండ్ ఫేస్ జూన్ 10 నుంచి జులై 1వరకు ఉంటున్నారు. ఎస్సీలు15 శాతం ,ఎస్టీలు 6 శాతం, బీసీలు 29%, సీ డబ్ల్యూ ఎస్ ఎన్ 3 శాతం ,ఎన్‌సీసీ, స్పోర్ట్స్ 5 శాతం, ఎక్స్ సర్వీస్ మెన్ డి ఫెన్స్ పర్సనల్ 3 శాతం, ఈ డబ్ల్యూ ఎస్ 10% సీట్లు కేటాయించబడతాయని వారు తెలిపారు. సంబంధించిన కళాశాలలో దరఖాస్తు చేసుకోవచ్చని వారు సూచించారు.

బుగ్గనకు దెబ్బ మీద దెబ్బ- టీడీపీలోకి సర్పంచు అర్జున్ రెడ్డి

విశాలాంధ్ర -డోన్: డోన్ అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి దెబ్బ మీద తగులుతోంది. ఇంత కాలం విజయంపై నమ్మకంతో ఉన్న ఆయనకు జనం ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ప్రతి రోజు గ్రామాలు, పట్టణాలు అన్న తేడా లేకుండా టిడిపి, బిజెపి, జనసేన ఉమ్మడి పార్టీల అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి మద్దతుగా నిలుస్తున్న ప్రజల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా శనివారం డోన్ మండలం కమలాపురం గ్రామానికి చెందిన 500కుటుంబాలు పారిశ్రామిక వేత్త సర్పంచ్ అర్జున్ రెడ్డి నేతృత్వంలో శనివారం వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి అభివృద్ధి అన్నదే లేకుండా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనపై ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు. గతంలో తెలుగుదేశం పార్టీ పాలనలో గ్రామాలకు నిధులు సమృద్ధిగా ఇచ్చే వారని ఆయన గుర్తు చేశారు. ఇపుడు గ్రామాలకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకుండా అస్తవ్యస్తం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదేమని ప్రశ్నిస్తే పోలీసు కేసులతో వేధించడం మినహా ప్రజలకు సమాధానం చెప్పడం లేదని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే గ్రామాలు మళ్లీ అభివృద్ధి బాటలో పయనిస్తాయన్న నమ్మకం ప్రజల్లో కనిపిస్తోందని ఆయన అన్నారు.టీడీపీ నాయకుల కష్టాలను పలుపంచుకుంటానని, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.స్థానిక ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి ఎపుడు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని దీని వల్ల ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని విమర్శించారు. ఎపుడు అప్పుల కోసం ఢిల్లీ, ముంబై నగరాల చుట్టూ తిరుగుతూ డోన్ నియోజకవర్గాన్ని విస్మరించారని మండిపడ్డారు. ఎపుడో నిర్మించిన రహదారులను తాను నిర్మించినట్లు చెప్పుకోవడమే తప్ప కొత్తగా ఆయన మంజూరు చేసింది ఏదీ లేదని ఆరోపించారు.బుగ్గన డబ్బు రాజకీయం చేస్తున్నాడని మండిపడ్డారు.కొన్ని భవనాలు ఎన్నికలకు ముందు నిర్మాణ పనులు ప్రారంభించి పనులు జరుగుతున్న సమయంలోనే వాటిని ప్రారంభించి వారి తొందరపాటును ప్రజలకు చూపించారని ఎద్దేవా చేశారు. ఎలాగూ తిరిగి అధికారంలోకి రాలేమని తెలిసి పూర్తి కాని భవనాలను ప్రారంభించారని కోట్ల విమర్శించారు. కమలాపురం గ్రామ సర్పంచ్ అర్జున్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆరాచకాలతో అబద్ధాలతో పాలిస్తూ రాష్ట్రాన్ని సుడిగుండంలా తయారుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న కసి ప్రజల్లో ఉందని తెలిపారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు వస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తాము ఇంత కాలం బుగ్గన వెంట నడిచి పొరపాటు చేశామన్నారు.ఆయన ను నమ్మి కోట్లాది రూపాయలు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.అయిన అక్కడ గుర్తింపు లేదన్నారు.అనంతరం మండల పరిధిలోని అభిరెడ్డిపల్లె, వెంకటాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తెలుగు యువత నాయకులు కోట్ల రాఘవేంద్రా రెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్లలో వైసీపీ నేతల విస్తృత ప్రచారం



విశాలాంధ్ర-కోడుమూరు: మండల పరిధిలోని గోరంట్లలో నియోజకవర్గ సమన్వయకర్త,కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి,కోడుమూరు వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి ఆదిమూలపు సతీష్‌లు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైన బివై రామయ్య, ఆదిమూలపు సతీష్‌లను గెలిపించాలని,ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.శనివారం కోడుమూరు జడ్పీటీసీ రఘునాథరెడ్డి, ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గోరంట్ల గ్రామంలోని అన్ని వీధులలో ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదప్రజల కోసం వైయస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలుతో ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరిందని, కాబట్టి మళ్లీ వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. చంద్రబాబు నాయుడుకు ఓటు వేస్తే ప్రజలందరినీ నట్టేట ముంచడం ఖాయమన్నారు.రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం మళ్లీ విజయం సాధిస్తే,వైయస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని,రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రూతమ్మ,వైసిపి నాయకులు మాధవ నాయుడు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.